క్లుప్తంగా

పేద వృద్ధులకు బియ్యం పంపిణీ



పేద వృద్ధులకు బియ్యం అందిస్తున్న మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

తాళ్లపూడి: పేదలకు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలోని 25 మంది పేద వృద్ధులకు ఒక్కొక్కరికి 15 కేజీల చొప్పున శుక్రవారం బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్‌పర్సన్ ఎం.శాంతి లిల్లీ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం సహా 58 గ్రామాల్లోని పేద వృద్ధులకు బియ్యం అందజేస్తున్నామన్నారు. అలాగే పేదలకు ఉచిత న్యాయ సేవ, ఉచిత వైద్య శిబిరాలు, వితంతువులకు ప్రతినెలా నగదు పంపిణీ, ఉచితంగా ఆహారం అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎం.ధనరాజు, గ్రామానికి చెందిన మోషే పాల్గొన్నారు.

'మానవత 'ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం



సభలో మాట్లాడుతున్న మానవత సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: విద్యార్థుల కోసం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ శుక్రవారం ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించింది. స్థానిక శ్రీ విజేత హైస్కూల్లో నిర్వహించే ఈ శిబిరంలో రోజూ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌లలో శిక్షణ ఇస్తామని ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు రాజశేఖర్, దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు జేవీ ప్రమోద్‌కుమార్, సుజాత, ప్రసన్నకుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తెరిపిచ్చిన వర్షం

కొవ్వూరు: ఐదు రోజుల నుంచి రోజూ వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం ఎనిమిది నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లా వ్యాప్తంగా మూడు మండలాల్లో మినహా ఎక్కడా వర్షం కురవలేదు. ఇది రైతులు కాస్త ఊరట కలిగించింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండ కాయడంతో రైతులు ధాన్యం ఒడ్డిడి చేసుకునే పనిలో పడ్డారు. జిల్లాలో పెరవలి మండలంలో గరిష్టంగా 24.8మిల్లీ మీటర్లు, ఉండ్రాజవరంలో 10.4, కోరుకొండలో 7.6, కొవ్వూరులో 0.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన మండలాల్లో ఎక్కడ చినుకు జాడ కనిపించకపోవడంతో రైతులు ఊపిరి తీసుకున్నారు.

బాలదుర్గమ్మకు ఇత్తడి గరగల సమర్పణ



గరగలు సమర్పిస్తున్న అంబటి వీరవెంకట సత్యనారాయణ దంపతులు

దేవరపల్లి: స్థానికంగా కొలువైన బాలదుర్గమ్మ వారికి గ్రామానికి చెందిన అంబటి వీరవెంకట సత్యనారాయణ, పద్మావతి దంపతులు శుక్రవారం రాత్రి రెండు ఇత్తడి గరగలను సమర్పించారు. ఆలయంలో పూజలు నిర్వహించాక గరగలకు ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావులకు అందజేశారు. అర్చకులు ఎ. వంశీ పూజలు నిర్వహించారు.

ఆర్డీవో ఆఫీసు వద్ద టీడీపీ ధర్నా

కొవ్వూరు: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ టీడీపీ నాయకులు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ పార్టీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి ఆధ్వర్యంలో తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఆర్డీవో ఎస్.మల్లిబాబుకు వినతి పత్రం అందజేశారు. ట్రాక్టర్‌తో ధాన్యం బస్తాలు తీసుకుని వచ్చి నిరసన వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాయిన రామకృష్ణ, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాస్ ,యనమదల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వరం పీఎంశ్రీ నిధులు

- నియోజకవర్గంలో 4 పాఠశాలల ఎంపిక
- స్కూళ్ల అభివృద్ధికి కేంద్రం నుంచి 60, రాష్ట్రం నుంచి 40 శాతం నిధులు

నల్లజర్ల: విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యమని భావించిన కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లోని విద్యాలయాలకు ఇతోధిక ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరిట ఈ పథకానికి నిధులు అందించనున్నారు. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకు రావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. కేంద్ర పభుత్వం 60 శాతం నిధులను సమకూర్చితే మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్నది. గోపాలపురం నియోజకవర్గంలో తొలి విడత నాలుగు పాఠశాలలను ఎంపిక చేసింది. నల్లజర్ల మండలంలోని అనంతపల్లి జెడ్పీహైస్కూల్, ద్వారకాతిరుమల మండలంలోని ఎం.నాగులపల్లి ఎంపీ యూపీ స్కూల్, దేవరపల్లి మండలంలోని దేవరపల్లి జెడ్పీ హైస్కూల్, గోపాలపురం మండలం చిట్యాల పాఠశాలలను ఎంపిక చేశారు.



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన అనంతపల్లి జెడ్పీ హైస్కూలు

ఇవీ ప్రయోజనాలు

- ఎంపికైన పాఠశాలలకు నిధుల కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధనకు ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక సహకారం
- ప్లాస్టిక్ రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం.
- సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం.
- పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వాములను చేస్తూ హరిత పాఠశాలలుగా మార్చడం
- బడిలోనే సేంద్రియ విధానంలో కూరగాయలు, ఆకుకూరలు పండించడం
- విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యం సాధించడంపై దృష్టి
- దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన బోధన పరికరాల ఏర్పాటు
- బాలికా విద్య అభివృద్ధి, సైన్స్ ప్రాజెక్టులు
- అందుబాటులోకి ల్యాబ్,స్మార్ట్, ఆర్ట్ తరగతి గదులు, గ్రంథాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానెల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం
- అన్ని కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల భాగస్వామ్యం

మౌలిక వసతుల పెంపు

ఈ పథకం కింద పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయల్లో నాణ్యతా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తారు. అలాగే తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికకు అనుగుణంగా బోధన సామగ్రిని సమకూరుస్తారు. దీనిపై జిల్లాస్థాయి కమిటీలు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ఐదేళ్ల పాటు ఈ పథకం కింద అవసరమైన నిధులు ఎంపిక చేసిన పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి.

వేములమ్మ గుడిలో విగ్రహ ప్రతిష్ఠ



వేములమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

నల్లజర్ల: నబీపేట గ్రామదేవత వేములమ్మ వారి నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వందేళ్ల నాటి అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులందరూ కలిసి రూ.15 లక్షల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈనెల 3 నుంచి బయ్యన్నగూడెంకు చెందిన వేద పండితుడు కుమార్ స్వామి బృందం పూజాదికాలు నిర్వహించారు. శుక్రవారం గవ్యాంత మార్జనలు, అమ్మవారి విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, అమ్మవారి దివ్య దర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. నబీపేట సర్పంచ్ గోతం సత్యలక్ష్మి, కృష్ణా యాదవ్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, కమిటీ సభ్యులు రాము, లక్ష్మణ్, గోతం గంగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే ఉపేక్షించబోం

- మిల్లర్లు, అధికారులకు ఎంపీపీ కార్చెర్ల హెచ్చరిక
- రైతులు, వివిధ శాఖల అధికారులు, మిల్లర్లతో భేటీ

పెరవలి: రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్ల, అధికారులను క్షమించేది లేదని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ హెచ్చరించారు. మిల్లర్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది, సొసైటీ అధ్యక్షులు, రైతులతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో మిల్లర్ల నుంచి రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమావేశంలో చర్చించారు.

అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రైతులు మిల్లులకు తరలించిన ధాన్యాన్ని 24 గంటలు దాటితే గాని అన్ లోడ్ చేయడం లేదని, తడవకపోయినా, తేమశాతం లేకపోయినా రైతుల నుంచి మిల్లర్లు సొమ్ములు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ సమస్యలను నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి దృష్టికి తీసుకెళుతున్నామని, అవసరమైతే ఆయన ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

40 శాతానికి సొమ్ములు చెల్లించాలట..

సమావేశంలో పూరెళ్ల వెంకటేశ్వరరావు అనే రైతు మాట్లాడుతూ చిరిగిన గోనె సంచులు ఇస్తున్నారన్నారు. వాటిలో ధాన్యం పట్టి తీసుకువెళితే తూకం తక్కువగా ఉందని, నూక శాతం 40 శాతం ఉందంటూ మిల్లర్లు సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. నాగిరెడ్డి చిన వెంకటేశ్వరరావు అనే మరో రైతు మాట్లాడుతూ తాను పండించిన ధాన్యం లోడులను ఒక రైస్ మిల్లు వద్ద సక్రమంగా ఉందంటూ స్వీకరించారని, అదే ధాన్యాన్ని మరో రైస్‌మిల్లర్లు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. ఏవో మేరీ కిరణ్ మాట్లాడుతూ 30 శాతానికి పైబడి నూక వస్తే కింటాకు కేజీ చొప్పున ధాన్యం తీసుకోవాలని, 40 శాతం నూక అయ్యేలా ఉంటే 2 కేజీలు తీసుకోవాలన్నారు. అందుకు విరుద్ధంగా మిల్లర్లు, ఆర్‌బీకే సిబ్బంది వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ మూడు రోజుల్లోగా ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో గాని, ఆన్‌లైన్‌లో గాని మిల్లులకు తరలించాలన్నారు. ఆ తర్వాత తుపాను వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఉద్యాన అధికారి హరిత, ఈఓపీఆర్‌డీ నరసింహమూర్తి పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సమస్యలు వివరిస్తున్న రైతులు

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఉండ్రాజవరం: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొంటుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. మండలంలో సత్యవాడ, కాల్దారి, వేలివెన్ను గ్రామాల్లో పడిపోయిన వరి పైరును, తడిసిన ధాన్యాన్ని ఆయన తహసీల్దార్ జి.కనకరాజుతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే పరిష్కరించాలని అధికారులను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో గృహ సారథుల మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థ రాజు, కాల్దారి సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, పాలాటి శరత్ బాబు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

నిడదవోలు రూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని, నేలవారిన వరి పంటలను పల్లారావు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్‌బీకే సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. పల్లారావు మాట్లాడుతూ ధాన్యం కొనగోళ్ల విషయంలో టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతాలు చేస్తున్నారన్నారు. సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగరావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు: తడిసిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నామని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్లు, ఎస్.ముప్పవరం, మార్కొండపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. పలుచోట్ల తడిసిన ధాన్యాన్ని, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఆఫ్‌లైన్‌లో 6,686 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. తడిసిన ధాన్యం ఉంటే గ్రామాల్లో ఆర్‌బీకేల సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో కె. వేణుగోపాల్, ఎంపీడీవో పి. రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కె.నిరంజనకుమార్ ఉన్నారు.



కాల్దారిలో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న సుబ్బారావు, తహసీల్దార్ కనకరాజు తదితరులు



చాగల్లు మండలం ఊనగట్లలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సర్దార్ పాపన్న గౌడ్ స్ఫూర్తితో పయనిద్దాం

- ఈ నెల 14న కొవ్వూరులో విగ్రహావిష్కరణ
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: భారత దేశ తొలి బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఈనెల 14న కొవ్వూరు నుంచి దొమ్మేరు రోడ్డు వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద (కొవ్వూరులో) అత్యంత భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శుక్రవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో విగ్రహావిష్కరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా, రాష్ట్ర గౌడ సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు తాతా కృష్ణారావు, ఆ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్ విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ కొవ్వూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గంధ్రోతు కోదండ రామారావు స్థలంలో నెలకొల్పే పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని ప్రతి కుటుంబం కదలి రావాలన్నారు. రాష్ట్ర గౌడ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ సేన ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు మాట్లాడుతూ ఈనెల 14న మధ్యాహ్నం 3 గంటలకు పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు ఎంపీ మార్గాని భరత్ రామ్, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్ విచ్చేస్తున్నారన్నారు. సమావేశంలో గౌడ సంఘం నాయకులు బుడ్డిగ శ్రీనివాస్, మట్టా శ్రీనివాస్, మట్టా వెంకట్రావు, మన్యం సూరిబాబు, ముప్పిడి నాగేశ్వరరావు, కృష్ణారావు, రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

దేవరపల్లి: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటను తక్షణం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ నాయకుడు డి.సువర్ణరాజు కోరారు. మండలంలోని సంగాయగూడెంలో వర్షాలకు మొలకలు వచ్చిన వేరుశనగ పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కాట్నం గణేష్, గాజుల రవికుమార్, ఆరేటి రత్నం, ఉందుర్తి శ్రీను, యామర్తి కృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.1,400 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్

- తీరనున్న డెల్టా ప్రాంత వాసుల దాహార్తి
- గ్రామీణ నీటిపారుదల, పారిశుధ్య శాఖ సీఈ గాయత్రి

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.1,400 కోట్ల వ్యయంతో మంచినీటి సరఫరా పథకాన్ని చేపడుతున్నట్టు గ్రామీణ నీటిసరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ టి.గాయత్రి వెల్లడించారు. జలజీవన్ మిషన్ నిధులతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే టెండర్లు, అగ్రిమెంట్లు ప్రక్రియ పూర్తయినట్టు వెల్లడించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయనున్నట్టు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వివిధ పథకాల పురోగతిపై శుక్రవారం కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సమీక్షించారు. ప్రధానంగా జల జీవన్‌మిషన్ పనులు, జగనన్న కాలనీలకు కుళాయిల ఏర్పాటు, తాగునీటి పథకాల నిర్మాణంపై సమీక్షించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సీఈ విలేకర్లతో మాట్లాడారు. జలజీవన్ మిషన్ కింద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1,178 ఆవాసాలకు, పది నియోజకవర్గాలకు చెందిన 17.85 లక్షల మందికి తాగునీటి సరఫరాకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 9,662 లే అవుట్లలో మొదటి విడతగా 1,622 లేఅవుట్లలో శాశ్వత తాగునీటి పథకాల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో 64.81 లక్షల కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 35 లక్షల కుటుంబాలకు కుళాయిలు బిగించామన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తాగునీటి చెరువులను ఇప్పటికే పూర్తిగా నీటితో నింపామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ, భీమవరం ఈఈ ఏఎస్ఏ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ గాయత్రి

ముగిసిన వేంకటేశుని కల్యాణోత్సవాలు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. వైశాఖ మాసం శుక్రవారం కావడంతో వేలాది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో క్యూ లైన్ జాతీయ రహదారిపైకి చేరింది. స్వామి వారి దర్శనానికి 3 గంటల సమయం పట్టింది. శుక్రవారం సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామి వారికి వందలాది మంది తలనీలాలు సమర్పించారు. భక్తులందరికీ ఉదయం, సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం ఒక్క రోజే 15 వేల మంది భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మనసు నిర్మలంగా ఉంటేనే

జీవితం సుసంపన్నం

- బౌద్ధధమ్మ పీఠం అధిపతి బంతె అనాలియో
- ఘనంగా బుద్ధ పౌర్ణమి

ఉండ్రాజవరం: మనసును పరిశుద్ధంగా ఉంచుకునేందుకు బుద్ధ భగవానుడు ఆర్య అష్టాంగ మార్గమును బోధించారని బౌద్ధధమ్మ పీఠం అధిపతి బంతె అనాలియో అన్నారు. బుద్ధ పౌర్ణమి మహోత్సవాన్ని శుక్రవారం స్థానిక బౌద్ధధమ్మ పీఠమైన మైత్రేయ బుద్ధ విహారలో బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనాలియో మాట్లాడుతూ మానవుడ్ని నడిపే మనసు నిర్మలంగా ఉన్నట్టయితే మానవ జీవితం సుసంపన్నం కావడంతో పాటు మానవ జీవితం ఆనందం అవుతుందన్నారు. బుద్ధ పౌర్ణమినే గురు పౌర్ణమి, వైశాఖ పౌర్ణమి అని కూడా అంటారన్నారు. బోధి సత్వ సిద్ధార్థుడి జననం, ఆయన సమ్యక్ సంబోధిని సాక్షాత్కరించుకుని బుద్ధునిగా అవతరించడం, బుద్ధ భగవానుడు మహాపరి నిర్యాణం అనే మూడు ప్రక్రియలూ వైశాఖ బుద్ధ పౌర్ణమి రోజునే జరిగాయన్నారు. అనంతరం బాల వికాస కేంద్రం, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉచిత బోధన అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బూరుగుపల్లి సుబ్బారావు, మల్లిన సత్యనారాయణ, బూరుగుపల్లి కళారావు, గంటా వెంకట్రావు, చిట్టూరి ఉషారాణి, ఆళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠంలో మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువు బంతె అనాలియో

పంచామృతాలతో అమ్మవారికి అభిషేకం

వైశాఖ మాస పౌర్ణమి సందర్భంగా స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అంతేగాకుండా అమ్మవారికి విశేష అలంకరణ చేసి, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి నదికి మహా నీరాజనం

కొవ్వూరు: వైశాఖ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. ముందుగా గోదావరి మాత విగ్రహానికి శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. 211వ మాసోత్సవంలో భాగంగా అఖండ గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించారు.జ్యోతిష పండితులు తుట్టగుంట భైరవమూర్తి, పాలకోడేటి సత్యనారాయణమూర్తిలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



గోష్పాద క్షేత్రంలో గోదావరి నదికి మహా నీరాజనం సమర్పిస్తున్న పండితులు



ఉండ్రాజవరంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకవ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమిశ్రగూడెం పోలీసులు తెలిపిన వివరిలా ఉన్నాయి. చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన రంతు ప్రసాద్ (45), కొయ్యలగూడెం మండలం చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన పోలవరపు పెద వెంకట్రావులు బైక్‌లో పెట్రోల్ పోయించుకుని బయటకు వస్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్‌కు తీవ్ర గాయాలై మృతి చెందగా, పెద వెంకట్రావును రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. వెంకట్రావు ఇంటిపై పెంకులు వేయడానికి చిక్కాల పనికి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడు ప్రసాద్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

వాలీబాల్ టోర్నీ విజేత ఉమ్మడి 'పశ్చిమ' బాలికల జట్టు

రన్నర్స్‌గా నిలిచిన పురుషుల జట్టు

కొవ్వూరు: ఈనెల 1 నుంచి ఐదో తేదీ వరకూ తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల బాలికల వాలీబాల్ విభాగంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈ విషయాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు జీవీ పవన్‌కుమార్‌రాజు, కొయ్యల ప్రసాద్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. వాలీబాల్ బాలుర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది.13 జిల్లాల నుంచి మహిళలు, పురుషుల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయన్నారు. లీగ్ దశలో కర్నూలు, అనంతపురం జట్లపైన, క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీకాకుళంపైన, సెమీఫైనల్స్‌లో గుంటూరు పైన, ఫైనల్‌లో కృష్ణా జట్టుపైన పోటీ పడి మహిళ జట్టు విజయం సాధించిందన్నారు. పురుషుల జట్టు లీగ్ దశలో నెల్లూరు, కృష్ణా జట్లపైన, క్వార్టర్ ఫైనల్స్‌లో విజయనగరం జట్టుపైన, సెమీఫైనల్‌లో శ్రీకాకుళం జట్టుపైన విజయం సాధించి ఫైనల్‌కి చేరిందన్నారు.ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జట్టు చేతిలో ఓటమి పాలై ద్వితీయ స్థానంలో నిలిచిందని ప్రసాద్ తెలిపారు. వాలీబాల్ బాలికలు, బాలుర జట్లు రెండింటికీ కొవ్వూరులోనే శిక్షణ ఇచ్చామన్నారు. ఈ జట్లకు తనతో పాటు కోడి రామ్‌కుమార్ కోచ్‌లుగా వ్యవహరించామన్నారు. జిల్లా డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు రెండు జట్లలోని క్రీడాకారులను, కోచ్‌లను అభినందించినట్లు తెలిపారు.



ద్వితీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పురుషుల జట్టు



వాలీబాల్ టోర్నీలో ప్రథమ స్థానం సాధించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టు